# ఆత్మబంధువు

శశిశ్రీ



ఉరుకులు పరుగులు మీద ఇంట్లో కొచ్చిన సీను ఆందోళనగా ఇల్లంతా కలియ జూసి-

"ఆమె వచ్చేస్తావుంది అమ్మా!"......!!! అన్నాడు కంగారుగా.

కుట్లు వూడిన రవిక కుట్టుకుంటున్న ఆమె కూతురు కళ్యాణి, స్నానానికి తువాలుతో జాలాట్లోకి పోబోతున్న సుబ్బరాయుడు ఒక్కమారు తమ పనులు ఆపేసి-సీనుకేసి చూశారు ఆశ్చర్యంగా.

"ఎవర్రా, ఎవరు వచ్చేస్తున్నారు?" ఇంటి ఇల్లాలు రత్నమ్మ అడిగింది. వచ్చేదెవరో..రాబోతున్న ఆ ప్రమాద దేవత ఎవరో కొంచెం కొంచెం అర్థమవుతూ వున్నా అనుమానంగా అడిగింది.

''ఆమెనే..సుగాలి'' అన్నాడు సీను మరింత ఆందోళనగా.

''సుగాలి సీతమ్మనా?'' ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

''అవును ఆమెనే! మన ఇంటి దిక్కునే వస్తుంటే..వీధి కుళాయి దగ్గరే బిందె వదిలేసి పరిగెత్తుకుంటూ వచ్చేశా'' ప్రమాదాన్ని కొంతలో కొంతైనా నిలువరిస్తామని వచ్చాను అన్నట్లుగా వుంది ఆ పిల్లోని ధోరణి.

''అబ్బ ఈమె పీడ ఎప్పుడు విరగడ అవుతుందో ఏమో''

కళ్యాణి మనసులోని బాధను కక్కేసి పని లేక పోయినా పొరుగు ఇంట్లోకి వెళ్ళిపోయింది మొహం చాటేస్తూ.

''ఎంత దూరంలో వుంది ఆమె'' అడిగాడు సుబ్బరాయుడు గాబరగా.

''నేను చూసేటప్పటికి-మసీదు మలుపు దగ్గర వుంది నాయనా?'' అన్నాడు.

''రత్నం ఒక నెల్లో ఆమె బాకీ ఎలాగోలా తీర్చేస్తామని సర్దిచెప్పు. నేను ఆమె కళ్ళబడితే యింకా రెచ్చి పోతుందేమో. నేను బయటికి పోతుండా'' స్నానం మానేసి దొడ్డిదారి లోంచి బయటికి వెళ్ళిపోయినాడు సుబ్బరాయుడు.

''పోపో ఈ ఇంట్లో ఈ ఆడదే అందరికీ అధవ చిక్కింది. ఆ పాడు సుగాలిదాన్ని ఎట్ల ఏగాలో ఏమో వీధిలో అందరి కళ్ళు మన ఇంటిపైనే. ఎవరు ఆమె ఎందుకొస్తుంది మీ ఇంటికి? సుగాలామెతో మీకేం పని? మీ ఆయనకు ఆమెకు ఏదో సంబంధం వుందంటనే నిజమేనా? ఇలా ఎన్ని ప్రశ్నల జవాబులు చెప్పలేక ఛస్తున్నా ఈ మహాతాటకి మళ్ళీ వూడి పడుతోంది. ఇలా లోలోపల కుమిలి పోతూ రాబోతున్న తుఫానును ఎలా ఎదుర్కో వాల్నో అన్న ఆలోచనలో పడింది రత్నమ్మ.

ఆ ఆలోచనల్లో వుండగానే సుగాలి సీతమ్మ గుమ్మంలో నిండుగా ప్రత్యక్షమైంది.

నుదుటి మీద పెద్ద రూపాయి బిళ్ళంత ఎర్రటి కుంకుమ బొట్టు. చెంపల మీద నాగుపాము పచ్చ పొడుపు. చిన్న చిన్న అద్దాలు వేసి కుట్టిన రంగు రంగుల పావడ అలాటిదే పై రవిక. రవికపై చిన్న చిన్న గవ్వల కుట్టు. చేతుల్లో దంతాలతో చేసిన వెడల్పాటి గాజులు. చెవుల్లో వెండి జుముకాలు. తలపై నించి భుజాల దాక వున్న రంగు రంగుల ముసుగు.

గారపట్టిన పళ్ళు కనిపించేలా నోరు తెరచి-

''ఏమ్మా! ఈ రోజైనా ఇంటికాడ సుబ్బ రాయుడు లేడా? పొద్దున్నే వస్తే వుంటాడని వచ్చినా'' అంది లోపలికి వస్తూ.

''ఆ నువ్వా రామ్మా, దా కూర్చో'' ఆహ్వానిం చింది రత్నమ్మ మనసులో అసహ్యించుకుంటూ.

''కూర్చోడానికేంలేమ్మా కూర్చుంటాగానీ, మీ ఇంటాయన నేను ఎప్పుడు వచ్చిన అగుపించడం లేదేమి? నేను వచ్చిపోతున్న సంగతి ఆయప్పకు మతికి చేస్తున్నావా లేదా''

పై ముసుగుతో చిరు చెమటను తుడుచు కుంటూ అంది సుగాలీ సీతమ్మ.

''ఎవరి దగ్గరికో పోవాలని పొద్దున్నే ఎల్ల బారి పోయినాడు. పొద్దునంగా పోతేనే ఇండ్ల కాడ వుంటారని మొహం కూడా కడుక్కోకుండా పోయి నాడు''.

త్రాగడానికి మంచినీళ్ల చెంబు అందిస్తూ అంది రత్నమ్మ.

నీళ్లు తాగి ''ఇల్లు గడవడం కష్టంగా వుంది బిడ్డ పెళ్ళికి ఎదిగింది. చూడ్డానికొస్తున్నారు. ఆ యమ్మికి నాలుగు మంచి జతలైన లేవు తొడిగించి, కూర్చో పెట్టడానికంటే వద్దు వద్దంటున్నా బాండు కూడా రాసిచ్చినాడనుకో, అప్పు సంగతి ఏమో కానీ, కనీసం కళ్ళకు మనిషి అగుపించకుండా పోవడం ఏం చోద్యమమ్మా?'' చిన్నగా తన బాకీ సంగతి కదిపింది సుగాలి సీతమ్మ

''నీ అంచున డబ్బు తీసుకుని కాదంటమా కాకపోతే ఆయనకు కుదురుగా ఏ పనీ దొరకడం లేదు. ఎన్నిసార్లు అనుకున్నామో కొంచెం ఓపిక పట్టు సీతమ్మ. మాగ్గానీ అనిపించుకోవాలని వుంటుందా'' ఈ మారు కాఫీ గ్లాసు అందిస్తూ అనునయంగా అంది రత్నమ్మ.

''ఇదో ఈ తేనె, కుంకుడు కాయలు, రేగి పళ్ళు తెచ్చినా ఇంట్లో పెట్టుకో'' వెంట తెచ్చిన సంచి తీసి అందించింది.

''నీవు వచ్చిన సారంతా ఏదో ఒకటి తెచ్చిస్తావు. ఆ మధ్యన వచ్చినపుడు ఆవు నూనెతో చేసిన అత్తిరసాలు తెచ్చిస్తివి. నీకు బాకీ వుండి మళ్లీ ఈ వుడుగరలు తీసుకోవడం ఏమైనా బాగుంటుందా చెప్పు'' అంది రత్నమ్మ.


''ఉప్మా చేస్తాను తింటావు గదా? మళ్ళీ తానే అంది రత్నమ్మ.

''మీ టిఫిన్లు గిఫెన్లు మాకు కాబట్టవు లేమ్మా. పొద్దున్నే రాత్రి సంగటి మజ్జిగలో కలుపుకుని తాగొస్తున్నా. మీ ఆయనొస్తే చెప్పు. బాండు వకీలు కిచ్చి కోర్టులో వేస్తానని చెప్పు. కళ్ళకు అగుపించ కుండా పోతుంటే ఎట్లా? ఇట్ల జేస్తే బాకీ అడ క్కుండా వదిలేస్తామా? మీ ఇంటి కాడికి వస్తుంటే మీ ఇంటి ఓనరు ఎదురుపడి అడిగినారు. సుబ్బ రాయుని యింటికి వస్తుంటావే ఎందుకు? ఏం పని మీద వస్తుంటావు అని అడిగిండు'' ఇంకా ఏదో అనేలోగానే

''ఆయనకు ఎందుకట? ఇంతకు నీవు ఏం చెప్తివి?'' వుత్సుకతతో ప్రశ్నించింది రత్నమ్మ.

''ఆయప్పకు మీరు నాలుగు నెలలుగా ఇంటి బాడుగ కట్టలేదని మిమ్మల్ని ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటే ఖాళీ చేయడం లేదని చెప్పినాడు. నీ అంచున ఏమైన డబ్బులు తీసుకొని వుంటే పైస లయిపోయినట్లే పనీపాటా లేని మనిషి ఎక్కడ్నించి తీరుస్తాడు. ఇంతకు నీకేమాత్రం ఇవ్వాలా? అని అడిగినాడు'' మధ్యలో ఆపి రత్నమ్మ మొహంలోకి చూసింది సీతమ్మ.

''ఇంటి బాడిగ సంగతేందో మాతో మాట్లాడు కోక వీధిలోఎదురుపడిన వాళ్ళనంతా అడిగితే ఆరుస్తారా తీరుస్తారా ఛీ పాడు కాలం వచ్చింది. ఇంకా ఎందర్తో ఎన్నెన్ని అనిపించుకోవాలో''



కుమిలి పోతూ అంది రత్నమ్మ.

"సర్లేమ్మా! లోకం కదా! అవన్నీ కాబట్టించు కుంటే సంసారాలు చేసినట్లే. అన్నం చుట్టం డబ్బు పగ అన్నారు పెద్దలు" అనునయంగా అంది సీతమ్మ.

"మేం నీకున్నబాకీ సంగతి గురించి మా ఇంటి ఓనరుతో ఏం చెప్పినావు?" మనసులో కెలుకుతున్న విషయాన్ని అడిగింది.

"నీవే అంటివి కదా వాళ్ళంతా ఆర్చేవారా తీర్చేవాదా? నేనాయప్పతో ఏదో అన్నాన్లే. ఇంతకు నీ బిడ్డ ఎటు పోయింది. ఇంట్లో లేదా? ఏదైనా సంబంధం కుదిరిందా?" యోగక్షేమాలు ప్రస్తా విస్తూ అడిగింది.

"సంబంధాలకేం నూటా ఒక్కటున్నాయ్. దిన మధ్యాహ్నంలో కుదురుతాయి. బిడ్డను బయటికి పంపాలంటే ఇక్కడ 'వుసి' వుంటే కదా? తులం బంగారం లేదు. పట్టుమని పదివేలు డబ్బులూ లేవు. ఇలా వుంది ఈ ఇంటి భాగోతం. ఎందుకులే తల్లి కడుపుకోసుకుంటే కాళ్ళపై పడుతుంది" కడుపులో బాధ బయట పెట్టుకుంది.

"వూ మళ్ళీ యింకొక సారిపోయి ఆ బస్సుల ఓనర్నే కాళ్ళు కడుపులు పట్టుకుంటే ఉద్యోగంలో పెట్టుకుంటాడేమో చూడమని చెప్పు. అన్ని కుదురుగా వున్న మా రాజులే వూరక కూర్చోరు. కూర్చోని తింటే కొండలు కూడా కరిగిపోతాయి. అప్పు పుట్టాలంటే ఆదరువు ఏదైనా వుంటే కదా ఇచ్చేవాళ్ళు ఇస్తారు" ఆత్మీయంగా శ్రేయోభిలాషిగా అంది సుగాలి సీతమ్మ.

"చెప్పకేం తల్లి చాలా సార్లు చెప్పినాను. మొహం ఎత్తుకుని వాళ్ళ కాళ్ళ దగ్గరికి పోవాలంటే నామోషిగా వుందంటాడు ఈ మనిషి" అని వంటింట్లోంచి మాడు వాసన వస్తుంటే పరుగున పోయింది రత్నమ్మ.

ఇచ్చిన అప్పు వసూలు చేసుకోవడానికి తమ ఇంటికి చక్కర్లు కొట్టున్న ఈమె, చిత్రమైన ప్రవర్తన రత్నమ్మకు ఒక పట్టాన అర్థం కావడం లేదు. తన బాకీ విషయంలో కరుకుగా నోరు చేసుకుంటుంది. అంతలోనే బాధలు పంచుకునే ఒక ఆత్మ బంధువులా మాట్లాడుతుంది. ఏ రకం మనిషో ఈమె అని మనసులో అనుకుటూ వంటింట్లోంచి వచ్చింది.

"సర్లేమ్మ, నేను పోవాలి. బస్సుటైం అవుతోంది మీ ఇంటాయన వస్తే మద్దిమడుగుకు వచ్చి మాట్లాడి పోమ్మను. ఇంక నేను రాను. బాండు వకీలుకు ఇచ్చి కోర్టుకు లాగుతా. అవతల నన్ను నిందించి లాభం వుండదు. వస్తా" అని బయలు దేరిపోయింది సీతమ్మ.

***

సుగాలి సీతమ్మ ఇంటికొచ్చి చేసి పోయిన హెచ్చరిక కంటే భార్య రత్నమ్మ పెట్టిన చీవాట్లకు సుబ్బరాయుడు మద్దిమడుగుకు బయల్దేరక తప్పింది కాదు.

గాలివీడు, నూలివీడు బస్సుకు సుబ్బరాయుడు కండక్టరుగా పోతున్న కాలం ప్రయివేటు బస్సు కండక్టర్ ఉద్యోగం కావడంతో ప్యాసింజర్ల లగేజీ విషయంలోను చార్జీల విషయంలోను రూపాయి, రెండు రూపాయిలు తక్కువ వున్నా ఎక్కించుకొని పోయేవాడు. అదే పల్లె జనానికి అతనిపై అభిమానం పెంచింది.

మద్దిమడుగు సుగాలీ తాండాల ప్యాసింజర్ల పాల డబ్బాలు, కట్టెల మోపులు యితర బస్సుల వాళ్లు వేసుకోరు. సుబ్బరాయుడు వాళ్ళ కోసం పది నిముషాలు బస్సు ఆపించి తీసుకెళ్ళేవాడు.

సుగాలీల లగేజీతో ఆలస్యం జరుగుతోందని కొందరు బస్సు ఓనరుతో కండక్టర్ సుబ్బరాయు డిపై ఫిర్యాదూ చేశారు. అందుకు సుబ్బరాయుడు "సుగాలీలు అన్ని సీజన్ల గిరాకీలు సారు. పైగా నమ్మకంగా మన బస్సే ఎక్కుతారు" అని చెప్పి పరిస్థితి నెగ్గించుకున్నాడు.

జరిగిపోయిన సంఘటన ఒకటి హఠాత్తుగా గుర్తుకొచ్చింది సుబ్బరాయునికి.

ఎప్పటిలా ఆ రోజు కడప నించి నూలివీడు బస్సు పోతోంది. బస్సులో ప్యాసింజర్లు కిటకిట లాడుతున్నారు రామాపురం సంతరోజు కావ డంతో రోజుకంటే ఎక్కువమంది ప్యాసింజర్లు ఎక్కించుకోవాల్సివచ్చింది.

బస్సులోంచి వున్నట్లుండి ఆడోళ్ళ కేకలు వినిపించాయి. ఏమిటని విషయం తెలుసుకుంటే లేడి ప్యాసింజర్లలో ఒకరికి పురిటి నొప్పులు ఎక్కువైె నాయని తెలిసింది. బస్సు ఆపమని లేడి ప్యాసింజర్లు అవతల అర్జెంటు పనులున్నాయని బస్సు ఆపొద్దని కొంచెం వేగంగా పోనిస్తే స్టేజి వచ్చేస్తుందని యింకొందరు ప్యాసింజర్లు.

బస్సు ఆపకపోతే గర్భిణీ ప్రాణాలకు ముప్పు అని స్త్రీలు గగ్గోలు చేశారు. సరిగ్గా ఆ సన్నివేశంలో సుబ్బరాయుడు విజిల్ వేసి బస్సు ఆపేశాడు. స్త్రీలు మినహా అందర్నీ బస్సు నించి దింపేశాడు.

ఆ గర్భిణీ ఎవరో కాదు సుగాలి సీతమ్మ బిడ్డ గౌరి.


బస్సులోనే వున్న స్త్రీ ప్రయాణీకులు సాటి స్త్రీ గౌరికి తోడు నిలిచారు. బస్సులోనే కానుపు జరిపించేశారు. పండంటి మగపిల్లవానికి జన్మ నిచ్చింది గౌరి. ఎలాంటి హాని జరగకుండా తల్లి, బిడ్డ క్షేమంగా వున్నారు.

ప్రయాణం ఆలస్యమైందని అసహనంగా వున్న ప్రయాణీకులను గమనించి కండక్టర్ సుబ్బ రాయుడు ఆ దారిలో వచ్చిన మరో బస్సును ఆపాడు. విషయం చెప్పి ప్రయాణికులను ఎక్కించి పంపాడు.

కండక్టర్, డ్రైవర్కు నచ్చ చెప్పి బస్సు వెనక్కి తిప్పాడు. మద్దిమడుగుకు వెళ్ళి సుగాలితాండాలో సుగాలి సీతమ్మ ఇంటి వద్ద దింపాడు. తర్వాతే బస్సు ఓనరు కస్సుబుస్సు అంటూ కండక్టర్ సుబ్బరాయుడిని పనిలోంచి తీసేశాడు. అదో అప్పట్నించి సుగాలి సీతమ్మ సుబ్బరాయుడు కుటుంబానికి దగ్గరైంది. ఆ చేరువనే సుబ్బ రాయునికి సీతమ్మ నించి పదివేలు అప్పు తీసు

## డిప్రెషన్‌ను దూరం చేసే బీట్రూట్

బీట్రూట్‌తో చేసిన కూరను కనీసం చూడడానికి కూడా చాలా మంది ఇష్టపడరు. దీనికి ప్రధానంగా రెండు కారణాలను చెప్పుకోవచ్చు. దీని ముక్కలు ఎర్రగా వుండడంతో పాటు రుచి కూడా అంతగా బాగుండదు. ఈ రెండు కారణాల వలన దీనిని పెద్దగా తినడానికి ఇష్ట పడరు. అయితే ఇందులో డిప్రెషన్‌ను దూరంచేసే గుణాలు మెండుగా వున్నాయిని హార్వార్డ్ యూనివర్శిటీ పరిశోధకులు చెపుతున్నారు. బీట్రూట్‌లో వుండే ఒమెగా-3, యురిడైన్ కాంబినేషన్ డిప్రెషన్‌కు మంచి మందుగా పనిచేస్తుంది. డిప్రెషన్‌తో బాధపడేవారు దీనిని పచ్చిగా తీసుకున్నా, లేక జ్యూస్‌గానో, వంటలలో వాడినా మంచి ఫలితం వుంటుందని రుజువైంది.



కునేలా చేసింది.

ఎక్కడన్న కుదురుగా ఉద్యోగం దొరికితే అప్పు డింత, ఇప్పుడింత అని తీర్చేయాలనే అనుకు న్నాడు. ఏ బస్సు ఓనరు కంటిన్యూగా డ్యూటీలో పెట్టుకోవడం లేదు. వారం పది దినాలు అవకాశం ఇస్తారు. తర్వాత కంటిన్యూ కండక్టర్ వచ్చేశాడని ఇంటికి పంపించేసినారు. ఇక సీతమ్మ బాకీ తీర్చే దిక్కులేక మొహం చూపలేక అగసాట్లు పడాల్సి వస్తోంది సుబ్బరాయుడికి.

ఆ ఆలోచనలోంచి బయటికి రాకముందే మద్దిమడుగు వచ్చేసింది. బస్సుదిగి సుగాలి తాండాకు నడిచాడు.

చుట్టూ కొండలు లోయ ప్రాంతం. కొండ చరియ క్రింద వరుసగా పూరి గుడిసెలు ప్రతి గుడిసె ప్రక్కనే కొండ రాళ్ళతో కట్టిన పిట్ట గోడలతో విశాలమైన బందెల దొడ్లు. ఆ దొడ్లలో మేకలు, పొట్టేళ్ళు, ఆవులు అవే వాళ్ళ సంపద. జీవన వృత్తి.

తెలిసిన గుడిసే కదా గుట్ట మీద ఆరు అంక ణాల్లో వేసిన ఆ గుడిసె దగ్గరికి చేరుకుని ఇంట్లోకి తొంగి చూస్తూ ''సీతమ్మ'' అని పిలిచాడు సుబ్బరాయుడు.

ఎవరు లోపల లేరు. పక్క గుడిసెల తాలూకు ఎవరో ఆడామ ''సీతాలు డైరోళ్లకు పాలు పోసేకి పోయింది. వస్తాది కూకో. ఆయమ్మ కూతురు కూడా చంటి పిల్లోనేసుకుని ఆవుల మందతో అడవికి పోయింది. ఎంతసేపులే వచ్చేస్తుంది'' అని చెప్పింది.

తీరా సీతమ్మ వస్తే ఆమెను ఎలా ఎదుర్కోవాలో అప్పులోకి కొంత జమ వేసి మిగతాది కట్టేందుకు టైం అడిగి వుంటే బావుండేది. కొంతలో కొంతైన శాంతపడేది. ఒట్టి చేతులు వూపుకొని మొహం చూసి పోడానికేనా వచ్చింది అని ఎక్కడ నామోషి చేస్తుందోనని మదనపడిపోసాగాడు సుబ్బరా యుడు.

ఆ ఆలోచనల్లో చూడలేక కళ్ళు తల దించు కున్నాడు.

''ఏంయా సుబ్బరాయుడు ఎంత సేపైంది వచ్చి'' సున్నితంగానే అడగటంతో కొంచెం మనసుకు ధైర్యం కలిగింది.

''ఇప్పుడే బస్సు దిగి వచ్చి కూర్చుంటున్నాను. అంతలోకే నీవు వచ్చేసినావు'' ఇంకా ఏదో అనబోయే లోగా ''లోపలికి రా'' అంటూ ఆహ్వానించింది. మంచం వేసింది కూర్చోడానికి.

పొయ్యిపైని సట్టిలోంచి పాలు పెద్ద గ్లాసులోకి వొంపి తెచ్చిస్తూ ''వుండు ఆవు నెయ్యితో చేసిన అత్తిరాసాలు ఇస్తా'' నంటూ వేలాడే వుట్టిలోంచి గిన్నె దింపి, మూకట్లో పెట్టి అందించింది.

రుచిగా వుంటే రెండు తిని పాలు లాగించాడు సుబ్బరాయుడు.

సుగాలీ సీతమ్మ కింద కూర్చుంటూ

''ఏంయా ఎన్ని సార్లు ఇంటికాడికి వచ్చినా కనబడవు. మొహం ఎందుకు సాటు చేస్తున్నావు'' విషయం లోకి దిగుతూ అంది.

''నా సంగతి, మా కుటుంబం సంగతి నీకు ఎరిక లేంది ఏముంది? నిజం చెప్తుండ ఎదురు పడ్డానికి మొహం చెల్లకే కనిపించలేదు. కొంచెం ఓపిక పట్టు. ఇప్పుడు కూడా వట్టి చేతులతో రావడానికి మనసు ఒప్పుకోలేదు. నీవు కోర్టుకు లాగుతా అని చెప్పి రావడంతో కంపరమెత్తి కనీసం కళ్ళకు కనిపించైనా వస్తామని వచ్చినాను'' మనసులో దాచుకోకుండా అనేశాడు.

''కోర్టుకు పోయే దాన్నే అయితే మీ ఇంటి సుట్టూ ఎందుకు తిరుగుతానయ్యా!ఎవరిమీద పగ సాధించాల నేను. చెట్టంత అల్లుడ్ని మావోయిస్టుల మనిషని పోలీసులు కాల్చి చంపేశారు. ఆ దిగులతో మా ముసలాయన పోయాడు. ఇప్పుడు మిగిలింది మా అమ్మి గౌరి. దాని కడుపులో మొలిసిన మొలక. ఆ రోజు నా బిడ్డను కాపాడి నావు. ఆ పని చేసినందుకు వుద్యోగమే వూడ గొట్టుకున్నావు. ఆ సాయమే మగ దిక్కులేని మా కుటుంబంలో మళ్ళీ ఓ పిల్లవానికి జన్మనిచ్చింది. నీవు చేసిన ఆ సాయం ఎప్పటికి మరచిపోకూడ దనుకున్నాం. మాకు ఉన్న మందలో అయిదు ఆవుల్ని నీ కోసం పక్కకి పెట్టినాను. దాండ్లకు పుట్టిన దూడలు వాటికి పుట్టినవి కలిపి ఇరవై అయినాయి. వాటి మీద వచ్చిన సొమ్మంతా పక్కన పెట్టినాను. కష్టాల్లో వున్నావు. నీవు బాగుపడితే మరి కొందరికి సాయం చేస్తావు'' అని తనపెద్దపాటి అడపం తీసి సుబ్బరాయునికిస్తూ ''ఇందులో యాభైవేలు వుంది తీసుకెళ్ళు. డీజల్ ఆటో తీసుకో. నీకు పనీపాటా దొరికినట్లు వుంటుంది. సంసా రమూ గడుస్తుంది''. అందులోనే నీవు రాసిచ్చిన బాండూ వుంది. ఇంటికి పోయి చూసుకో.

నీవు అప్పు అడిగిన రోజే నీ పేర్న పెట్టిన ఆవుల సంగతి చెప్పాలని నోటిదాక వచ్చింది. కానీ పాడుకరువు పరిస్థితులతో వచ్చిన ఆదాయం ఆడాడికే కరిగిపోయింది. ఈ మధ్యనే వర్షాలు రావడం కొండలు, గుట్టలు కొంచెం పచ్చబడి నాయి. దాంతో నాలుగురాళ్ళు కళ్ళచూసే వీలైంది'' అని అంది గుండె బరువునంతా దింపేసుకుంటూ.

సుబ్బరాయుడికి తాను వూహించనిది ఏదో జరిగిపోతూ వుండటం. తను, తన ఇంటిల్లిపాది ఈ దేవత గురించేనా అంత అసహ్యపడింది. ఈ మహాతల్లి గురించేనా చీదరించుకుంది. పశ్చాత్తాప పడిపోయాడు.

ఆమె మంచితనానికి మంచులా కరిగి ఆనందం ఆశ్చర్యం ఒళ్ళు కంపించేలా చేసింది సుబ్బ రాయునికి.

★

## కూరగాయలు... పండ్లూ సమానమే...!

ఇది కొంచెం అసంతృప్తినికి కలిగించే విషయమే. ఇప్పటి వరకూ కూర గాయలలో కన్నా కూడా పండ్లలో ఎక్కువ పోషకాలు వుంటాయని చాలా మంది భావిస్తూ వచ్చారు. పండ్లలో కేవలం విటమిన్ ఎ మరియు సి మాత్రమే వుంటాయని శరీరానికి అవసరమైన బి, ఇ, కె విటమిన్లు, మినరల్స్ కూరగాయల నుంచి మాత్రమే లభిస్తాయని డైటీ షియన్లు చెపుతున్నారు. ఇవే కాకుండా ఫైటో కెమికల్స్‌తో పాటు ఫైబర్ కూడా కూరగాయలలో అధికంగా లభిస్తుంది. కూరగాయలను తగ్గించి అంతకన్నా పెద్దమొత్తంలో పండ్లను తీసుకున్నా పెద్ద ఫలితం వుండదని వీరు స్పష్టం చేస్తున్నారు. పండ్లను, కూరగాయలను సమానంగా తీసుకు న్నప్పుడే శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభి స్తాయి.

